సాక్షి
నల్లగొండ
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



ఉన్నత ప్రమాణాలతో విద్య

ఉన్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్య నందించడమే తమ సంస్థ లక్ష్యమని డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 24,357 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 45,107 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,279 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,067 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6,791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.50 అడుగులు
ఇన్‌ఫ్లో	: 642.50 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 624.52 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 259.38 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 306.54 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

సీజ్ చేసిన వాహనాలకు 22న వేలం

దేవరకొండ : దేవరకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేయబడిన వాహనాలను జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఈనెల 22న వేలం వేయనున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 22న ఉదయం 10గంటల లోపు దేవరకొండ ఎక్సైజ్ కార్యాలయంలో రూ.10వేలు డిపాజిట్ చేసి తమ పేరును నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వాహన వేలంలో ఎలాంటి వాహనం కొనని పక్షంలో డిపాజిట్ తిరిగి ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరుగుపొరుగు వారితో ప్రేమతో మెలగాలి



హుజూర్‌నగర్‌లో చర్చి వార్షికోత్సవంలో మాట్లాడుతున్న బిషప్ ధమన్ కుమార్

హుజూర్‌నగర్ : ప్రతి ఒక్కరూ ఇరుగుపొరుగు వారితో ప్రేమతో మెలగాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా బిషప్ ధమస్‌కుమార్ సూచించారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సెయింట్ జోసెఫ్ చర్చి వార్షికోత్సవాన్ని ఆయన హాజరైన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ చూసినా స్వార్థం, హింసావాదం పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్యాథలిక్ కుటుంబాలకు ఫీస్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మరయ్య, సిస్టర్లు, వివిధ చర్చిల ఫాదర్లు పాల్గొన్నారు.

యాదాద్రిలో ఆధ్యాత్మిక పర్వాలు



శివాలయంలో స్పటిక లింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టి అభిషేకం, అర్చన చేశారు.అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శనహోమం, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. అదే విధంగా యాదాద్రి కొండపై ప్రధానాలయానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, శ్రీస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. క్షేత్రంలోని శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామికి ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు ,ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఫణిభూషణమంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, వంశీక్రిష్ణమాచార్యులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో స్వామివారిని గరుడవాహనంపై ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

● రాఖీ రద్దీ



రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులతో కిక్కిరిసిన నల్లగొండ బస్టాండ్



బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

● సార్.. మీరే మాకు 'రక్ష'



రక్షాబంధన్ సందర్భంగా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న నల్లగొండ శిశుగృహ బాలికలు, చిన్నారులు

పౌష్టికాహారం ఎలా..!

రూ.1.9కే కిలో ఆకుకూరలు.. రూ.23.9కు కిలో కూరగాయలు.. రూ.2కు 100 నిమ్మకాయలు

.. ఇవీ కొనుగోళ్ల కమిటీ ఆమోదించిన రేట్లు

- ఇష్టారాజ్య రేట్లతో కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్
- ఈ ధరకు వాటిని కొని విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడతారా
- అధికారుల నిర్ణయంపై సర్వత్రా విమర్శలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రూ.1.9లకే కిలో చొప్పున ఆకుకూరలు వస్తాయా? రూ.23.9కి కిలో చొప్పున కూరగాయలు వస్తాయా? రూ.2కు 100 నిమ్మకాయలను ఏ తోటలోనైనా రైతు ఇస్తాడా? అంటే అవునని జిల్లా కొనుగోళ్ల కమిటీ చెబుతోంది. విద్యాశాఖ పరిధిలోని కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్, మోడల్ స్కూల్ విద్యార్థులకు అందించే భోజనం కాంట్రాక్టరు ఇచ్చిన ఆ ఇష్టారాజ్య రేట్లకు కొనుగోళ్ల కమిటీ ఇటీవల ఆమోద ముద్ర వేసింది. దీనిపై జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భోజనం నాణ్యతపై నీలినీడలు

జిల్లాలో విద్యాశాఖ పరిధిలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), గురుకులాలు, మోడల్ స్కూళ్లలో చదివే విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతపై నీలినీడలు కమ్ముకున్నాయి. పౌష్టికాహారం విద్యార్థులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరల భోజనం అందే పరిస్థితి లేకుండా పోతోంది. కేవలం పప్పులతోనే విద్యార్థుల భోజనాన్ని మమ అనిపిస్తున్నారు. ఈ వ్యవహారంలో జిల్లా కొనుగోళ్ల కమిటీపైనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కమిటీలోని పెద్దలు ఎలా ఖరారు చేశారు? ఎవరి ఒత్తిడికైనా తలొగ్గారు? అన్నది తేలాల్సి ఉంది.

విద్యార్థులకు ఆకు కూరలు అందని ద్రాక్షే

జిల్లాలోని 27 కేజీబీవీలు, 17 మోడల్ స్కూళ్లు, 1 అర్బన రెసిడెన్షియల్ పాఠశాల ఉన్నాయి. ఈ పాఠశాలల్లో చదివేవారంతా పేద కుటుంబాలకు చెందిన వారే. ఇళ్లలో పౌష్టికాహారం దొరకని వారే. కేజీబీవీల్లో అయితే అంతకంటే ఇబ్బందికర పరిస్థితుల నుంచి వచ్చిన పిల్లలే ఉంటారు. అలాంటి వారికి ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంతో పాటు విద్యను అందించేందుకు ఆయా విద్యా సంస్థలను ఏర్పాటు చేసింది. వాటిల్లో ఉండే పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాల్సిన అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కాంట్రాక్టర్లకు మేలు చేసేలా, విద్యార్థులకు అరకొర ఆకు కూరలు, కూరగాయలతో భోజనం పెట్టేలా నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. వేల మంది విద్యార్థులు ఈ ఏడాదంతా ఇదే దుస్థితిని ఎదుర్కొనే పరిస్థితిని జిల్లా అధికారులే కల్పించడం గమనార్హం.

నాణ్యతకోసం ప్రభుత్వం తనిఖీలు చేయిస్తున్నా

పప్పుల విషయంలో మాత్రం బహిరంగ మార్కెట్‌లో ఉన్న రేట్లకు అటూఇటుగా ధరలను ఖరారు చేసిన కమిటీ వీటి ధరల విషయంలో ఎందుకు ఇలా చేసిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించేందుకు, వాటిని గాడిలో పెట్టేందుకు ఓ పక్క ప్రభుత్వం ఏసీబీతో తనిఖీలు చేయిస్తుంటే ఉన్నతాధికారులే విద్యార్థుల ఆహారాన్ని పణంగా పెట్టి కాంట్రాక్టర్‌కు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవడం పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆ రేట్లకు వస్తాయా.. పిల్లలకు ఏం పెడతారు?

జిల్లా కొనుగోళ్ల కమిటీ గత నెలలో టెండర్లను ఖరారు చేసింది. ఎస్‌ఎస్ సిన్హయాన ట్రేడర్స్‌కు కాంట్రాక్టును ఓకే చేసింది. అందులో ఆలుగడ్డ, బెండకాయ, వంకాయ, క్యాబేజీ, కందగడ్డ, మునక్కాయ, సొరకాయ, దొండకాయ, టమాట, క్యాలీఫ్లవర్, బీట్‌రూట్, చిక్కుడుకాయ తదితర కూరగాయలు అన్నింటికి ఒకే ధర కిలో రూ.23.9లుగా నిర్ణయించింది. ఆ ధరకు ఆయా కూరగాయలు వస్తాయా? బహిరంగ మార్కెట్‌లో రేట్లు ఎలా? ఉన్నాయి.. ఆ ధరలతో కూరగాయలను ఎలా తెస్తారు.. విద్యార్థులకు వాటిని వండిపెట్టే అవకాశం ఉంటుందా? అన్న ఆలోచన కూడా చేయకుండానే ఖరారు చేసేశారు. ఇక నిమ్మకాయలైతే రూ.2లకు వంద కాయలు వస్తాయని, ఆ రేటును ఓకే చేశారు. పాలకూర, గోంగూర, తోటకూర, చుక్కకూర, గంగవాయిలి కూర వంటి ఆకుకూరలు కిలో రూ.1.9లకే వస్తాయని నిర్ణయించారు. ఉల్లిగడ్డకు కిలో రూ.2.9లకే వస్తాయన్న లెక్కలతో కాంట్రాక్టు ఖరారు చేయడం ఎవరిని బాగు చేసేందుకు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

నేటి నుంచి ఓటరు నమోదు

- 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారికి అవకాశం
- దరఖాస్తులు స్వీకరించనున్న బీఎల్‌ఓలు
- అక్టోబరు 29న ఓటరు ముసాయిదా జాబితా ప్రకటన



జిల్లాలో ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు 14,64,080	మహిళలు 7,37,789
పురుషులు 7,26,169	ట్రాన్స్ జెండర్స్ 122

నల్లగొండ : ఓటరు నమోదు కోసం ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు ఓటు నమోదు చేసుకునేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి ఇంటింటికీ బీఎల్‌ఓలు..

ఎన్నికల సంఘం కల్పించిన ఓటరు నమోదు కార్యక్రమానికి సంబంధించి బీఎల్‌ఓలు ఆయా వార్డులు, గ్రామాల వారీగా ఇంటింటికి తిరిగి ఓటరు నమోదు చేయించనున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించనున్నారు. అలాగే ఓటర్లకు సంబంధించి ఏదైనా సమాచారం తప్పుగా ఉన్న ఉదాహరణకు చిరునామాలో మార్పులు, చేర్పులు చేస్తారు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో కేంద్రానికి మార్పులు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

అక్టోబరు 29న ముసాయిదా జాబితా విడుదల....

ఈ నెల 20 నుంచి ఓటరు నమోదుకు ఇంటింటికి తిరిగి బీఎల్‌ఓలు దరఖాస్తులు స్వీకరిస్తారు. అదే విధంగా మార్పులు, చేర్పులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించి వాటన్నింటిని సరి చేసిన 29వ తేదీన ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించనున్నారు. ఆ జాబితాపై నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటిని కూడా పరిష్కరించిన తర్వాత తుది జాబితాను ప్రకటిస్తారు.

భారీ వర్షానికి పొంగిన వాగులు



గట్టుప్పల్ మండలం-ధర్మతండా రోడ్డులో ప్రవహిస్తున్న వాగు

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పుట్టపాక, గట్టుప్పల్ మధ్యలో వాగు పొంగిపొర్లింది. అదే విధంగా సంస్థాన్ నారాయణపూర్ మండలం లచ్చమ్మ గూడెం-గట్టుప్పల్ మధ్యలో, మండల కేంద్రం నుంచి ధర్మతండా మధ్యలో కల్వర్టులపై వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తి స్తంభించాయి.



గట్టుప్పల్ -పుట్టపాక మధ్యలో పొంగిపొర్లుతున్న వాగు

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సోమవారం మొత్తం 22 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా వ్యక్తిగత అంశాలు, భూములు, ఉద్యోగ, ఉపాధికి సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కోదాడ : సూర్యాపేట కలెక్టరేట్‌లో పరిపాలనా విభాగంలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న నాగారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ షఫిపై రైతుల నుంచి పలు ఆరోపణలు రావడంతో విచారణ చేసి కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

గోపాలమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి

పెద్దవూర : గ్రామీణ ప్రాంతాల్లో పశుగణాభివృద్ధి సంస్థలో పనిచేస్తున్న గోపాల మిత్రలకు కనీస వేతనం రూ.24 వేలు అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్రల సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెద్దవూరలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 24 ఏళ్లుగా సేవలు అందిస్తున్నా రూ.8500 వేతనమే అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం పశువైద్యశాఖలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ పోస్టుల్లో సీనియారిటీ ప్రాతిపదికన గోపాల మిత్రలకు అవకాశం కల్పించాలని, టీజీపీఎస్సీ ద్వారా భర్తీ చేసే వెటర్నరీ అసిస్టెంట్ పరీక్షలో అర్హత కలిగిన గోపాలమిత్రలకు 30 వెయిటేజీ కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2 లక్షలు ఇవ్వాలని, కనీస భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో చనిపోయిన గోపాలమిత్రల కుటుంబాలకు ప్రభుత్వం అందించే ప్రమాదభీమా రూ.6లక్షలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి దోమల ముత్తయ్య, యల్లంల శంభులింగం, సహాయ కార్యదర్శి గాలి లింగారెడ్డి, అల్దాస్ లింగయ్య, మల్లేశం, నర్సింహ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

పరిహారం లెక్క తేలేనా..!

- చింతపల్లి రిజర్వాయర్‌కు భూ సేకరణ సమస్య
- బహిరంగ మార్కెట్ రేటు కంటే తక్కువ ఇస్తుండడంతో భూములివ్వని రైతులు
- చింతపల్లి జలాశయ నిర్మాణానికి అడుగడుగునా ఆటంకాలు



చింతపల్లి చెరువు

చింతపల్లి : నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే లక్ష్యంతో డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చింతపల్లి, కిష్టరాయినిపల్లి, గొట్టిముక్కల, సింగరాజుపల్లి, చర్లగూడెంలో జలాశయాలు నిర్మించాలని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. మూడేళ్లలో పనులు పూర్తి చేసి 3.11లక్షల ఎకరాలకు నీళ్లు తీసుకురావాలన్న ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 2014 జూన్ 12న సుమారు రూ.6,190 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. ఇందుకు అవసరమైన భూ సేకరణ చేసి రిజర్వాయర్లను పూర్తి చేయాలని సంకల్పించారు. కానీ బహిరంగ మార్కెట్ విలువ కంటే తక్కువ నష్టపరిహారం చెల్లిస్తుండడంతో భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఓ ప్రాంతంలో ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలు చేయకపోగా మరో చోట భూ నిర్వాసితులు భూములు ఇచ్చేందుకు అంగీకార పత్రాలు అందజేసి సంవత్సరాలు గడుస్తున్నా నష్టపరిహారం అందించలేదు. దీంతో పాటు సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో అప్పట్లో పనులు ముందుకు సాగడం సాగడంలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించిందిన భూములు ఇచ్చేందుకు నిరాకరించిన రైతుల ఇళ్లకు నోటీసులు అంటించడంతో మండల కేంద్రంలో రైతుల్లో ఆందోళన మొదలైంది.

చింతపల్లిలో భూ సేకరణ సమస్య

చింతపల్లిలో 0.94 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించే రిజర్వాయర్‌కు చింతపల్లి, నసర్లపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన 1,691 ఎకరాల భూమి అవసరం ఉంది. ఇందులో పెద్ద చెరువు, చిన్న చెరువు కలుపుకొని333 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మిగతా భూమిని ప్రభుత్వం రైతుల నుంచి సేకరించాల్సిందే. మొదటి విడతలో ఎకరానికి రూ.4.15లక్షల చొప్పున 1209 ఎకరాలు, 2వ విడతలో రూ.5.15లక్షల నష్టపరిహారంతో 759 ఎకరాలను సేకరించేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2016 సంవత్సరంలో 197 మంది రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు రాగా నేటికి వారికి డబ్బులు అందలేదు. ఈ పరిహారం విషయమై పలువురు రైతులు కోర్టును కూడా ఆశ్రయించారు.

నష్టపరిహారం పెంచాలి



చింతపల్లి జలాశయం నిర్మిస్తే నాకున్న రెండున్నర ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. ప్రభుత్వం ఎకరానికి రూ.5.15లక్షల పరిహారం చెల్లిస్తుందని చెబుతున్నారు. ఏడేళ్ల క్రితమే భూమి ఇచ్చేందుకు అంగీకార పత్రం అందజేశాం. నేటికి పరిహారం అందించకపోగా పాత పద్ధతిలోనే రూ.5.15లక్షలు స్తామంటున్నారు. మార్కెట్ విలువ ప్రకారం.. రూ.30లక్షల నుంచి రూ.50లక్షల పరిహారం చెల్లించాలి.

– ఎల్లంకి చిన అశోక్, రైతు, చింతపల్లి

గతంలో పలుమార్లు ఆందోళన ..

చింతపల్లి జలాశయం నిర్మాణానికి భూ సేకరణ నాటి నుంచి నేటి వరకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. గతంలో నసర్లపల్లి కట్ట నిర్మాణ ప్రాంతంలో రైతులు మందు డబ్బాలతో జేసీబీ, ఇటాచ్ వాహనాల ఎదుట బైఠాయించి పనులను అడ్డుకున్నారు. మరికొంత మంది రైతులు భూములు ఇచ్చి పరిహారం కొరకు పడిగాపులు కాయాల్సి వస్తుందని వాపోతున్నారు. 2014 సంవత్సరంలో నిర్మాణానికి నోటిఫికేషన్ రాగా దాదాపు 10సంవత్సరాలు కావస్తున్నా పరిహారం రూ.5.15లక్షలే అంటూ రైతుల చుట్టూ అధికారులు తిరుగుతున్నా భూ సేకరణ ప్రక్రియ ఓ కొలిక్కి రావడం లేదు. ఇదిలా ఉండగా 333 ఎకరాల్లో చింతపల్లి పెద్ద చెరువు, చిన్న చెరువు కలుపుకొని ప్రాజెక్టును నిర్మిస్తే తమ భూములను ఈ ప్రాజెక్టు కింద సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

రాజాపేట: విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలైన ఘటన రాజాపేట మండల పరిధిలోని బంటుగూడెంలో సోమవారం జరిగింది. బంటుగూడెం గ్రామానికి చెందిన కర్రె లక్ష్మి, పాండవుల శారద తమ ఇళ్ల ముందు దండెంపై బట్టలు ఆరేస్తుండగా.. దండేనికి విద్యుత్ సరఫరా కావడంతో వారిద్దరు విద్యుదాఘాతానికి గురయ్యారు. పక్కనే ఉన్న వ్యక్తి గమనించి కర్ర సహాయంతో తీగను తప్పించడంతో వారు కిందపడిపోయారు. లక్ష్మి, శారదకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

త్రిపురారం: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్య తండాలో జరిగింది. సోమవారం ఎస్ఐ వీరశేఖర తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పుల్లగిరి గ్రామానికి చెందిన ముడావత్ బాలు(43) గత 20 ఏళ్లుగా మద్యానికి బానిసై పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఆదివారం త్రిపురారం మండలం అప్పలయ్యగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సీత్యాతండాలో గల ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఆలయంలో ఉండగా.. రాత్రి 10 గంటలకు బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అతడి భార్య ముడావత్ తరి ఆలయం బయటకు వెళ్లి వెతకగా.. గుడికి సమీపంలో చెట్టుకు తన లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

నేరేడుచర్ల : దొంగతనం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామానికి చెందిన అంతని గోపి అనంతగిరి మండలం శాంతినగర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 2023 సెప్టెంబర్ 15న మేడారం గ్రామంలో నెమలితోక సోడమ్మ తన ఇంట్లో నిద్రిస్తుండగా ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెలతాడును గోపి దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదే రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా 2022 మే 5వ తేదీన చిలుకూరు మండలం పోలేనిగూడెంలో ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారపు గొలుసును కూడా గోపి దొంగిలించాడు. తాను చోరీ చేసిన సొత్తును సోమవారం నేరేడుచర్లలో అమ్మేందుకు గోపి వెళ్తుండగా.. పోలీసులు పట్టుకుని అతడి వద్ద నుంచి రెండు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. గోపిపై మునగాల, సూర్యాపేట, చివ్వెంల, మోతె, నడిగూడెం, చిలుకూరు, నేరేడుచర్ల పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అవినీతి ఉద్యోగులపై కొరడా

- 'సాక్షి' కథనానికి స్పందించిన సూర్యాపేట కలెక్టర్

కోదాడ: రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కోదాడ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. తహసీల్దార్‌ను బదిలీ చేయడంతోపాటు ఆర్ఐని సస్పెండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారసత్వ భూమి భాగ పంపిణీ కోసం ఓ రైతు కుటుంబం నుంచి కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో రూ.1.50లక్షలను కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూలు చేయడంపై 'లక్షల్లో వసూలు చేశారు' అనే శీర్షికన ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. స్థానిక ఆర్డీఓతో విచారణ చేయించారు. తహసీల్దార్ సాయిరాం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.సుజాతపై రైతుల నుంచి వచ్చిన పలు ఆరోపణలు వాస్తవమని తేలింది. దీంతో తహసీల్దార్ ను బదిలీ చేయడమే గాక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.


హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి


రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరి హితాశ్రీ


రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రాఖీ కడుతున్న ఆయన సోదరీమణి


తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



'రాఖీ కట్టేందుకు ఆడపిల్లను కాపాడుకుందాం' అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు


ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు రాఖీ కడుతున్న మంత్రి సీతక్క


మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి తన క్యాంపు కార్యాలయంలో రాఖీ కడుతున్న మహిళలు


సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్


భువనగిరి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు


రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికులతో కిటకిటలాడుతున్న కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్


నల్లగొండ నుంచి బస్సులో నిలబడి ప్రయాణిస్తున్న మహిళలు


నల్లగొండ బస్టాండ్‌లో టికెట్ కౌంటర్ వద్ద భారీ క్యూ


మాజీ మంత్రి కేటీఆర్‌కు రాఖీ కట్టి యాదాద్రి ప్రసాదం తినిపిస్తున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతు

వేములపల్లి: సాగర్ ఎడమ కాల్వలో బాలిక గల్లంతైంది. ఈ ఘటన సోమవారం వేములపల్లి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కుసుమవారిగూడెం గ్రామానికి చెందిన పోతురాజు విజయలక్ష్మి, సైదులు దంపతులకు కుమార్తె తేజశ్రీ (14), కుమారుడు గోపిచంద్ సంతానం. విజయలక్ష్మి తమ్ముడు కోదాడి పరుశురాములు వివాహానికి ఆరు రోజుల క్రితం కుటుంబ సభ్యులంతా కలిసి వేములపల్లి మండలం బుగ్గబావిగూడేనికి వచ్చారు. ఆదివారం వివాహం అయిపోగా సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్-14 వద్ద గల బట్టలు ఉతికేందుకు విజయలక్ష్మి, కుమార్తె


తేజశ్రీ

తేజశ్రీ, కుమారుడు గోపిచంద్‌తో పాటు మరికొందరు బంధువులతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో తేజశ్రీ ఒక్కసారిగా కాలు జారి కాల్వలో పడిపోగా ప్రవాహానికి కొట్టుకుని పోయింది. తేజశ్రీని కాపాడేందుకు పలువురు ప్రయత్నించగా ప్రవాహ వేగానికి గల్లంతైంది. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని తేజశ్రీ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తేజశ్రీ పెన్‌పహాడ్ కేజీబీవీలో 9వ తరగతి చదువుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరు దుర్మరణం

- ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు

కోదాడ: పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద సోమవారం తెల్లవారుజామున రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పట్టణ ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం .. కోదాడ పట్టణానికి చెందిన గుడుగుంట్ల రామకృష్ణ (48) మందులు కొనుగోలు చేసేందుకు సోమవారం తెల్లవారుజామున బైక్‌పై ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా.. కూరగాయల మార్కెట్ వద్ద మరో బైక్‌పై ముగ్గురు యువకులు అతివేగంగా వచ్చి రామకృష్ణ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందాడు. ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కాగా.. అందులో ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడిని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన బైక్.. యువకుడు మృతి

చిట్యాల: బైక్‌పై వెళ్తున్న యువకుడు చెట్టును ఢీకొట్టి మృతిచెందాడు. ఈ ఘటన చిట్యాల మండలం పేరేపల్లి గ్రామ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ జానారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పేరేపల్లి గ్రామానికి చెందిన రూపని రాజశేఖర్(31) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం బైక్‌పై వెలిమినేడు గ్రామానికి వెళ్లి రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. పేరేపల్లి గ్రామ పరిధిలోకి రాగానే బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. సోమవారం మృతుడి తమ్ముడు రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి పాల ట్యాంకర్ బోల్తా

పెద్దవూర: మిర్యాలగూడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న పాల ట్యాంకర్ ఆదివారం రాత్రి పెద్దవూర మండల కేంద్రంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బోల్తా పడింది. పెద్దవూర మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా.. ప్రధాన రహదారికి డైవర్షన్ ఏర్పాటు చేసి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆదివారం రాత్రి అతివేగంగా వస్తున్న పాల ట్యాంకర్ డ్రైవర్ దగ్గరికి వరకు వచ్చాక రోడ్డు డైవర్షన్‌ను గమనించి వాహనాన్ని ఒక్కసారిగి పక్కకు తిప్పడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గాలిపంపును, మోటార్లను, డివైడర్లకు అమర్చిన ఇనుప గ్రిల్స్‌తో పాటు పక్కనే 33/11 కేవీ విద్యుత్ స్తంభాన్ని తాకుతూ వెళ్లి బోల్తాపడింది. దీంతో చాసిస్ నుంచి ట్యాంకర్ ఊడిపోయి సగానికి పైగా పాలు రోడ్డుపాలయ్యాయి. ఉదయం వేరే ట్యాంకర్‌ను తీసుకొచ్చి ట్యాంకర్‌లో మిగిలిన పాలను తీసుకెళ్లారు. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.


చాసిస్ నుంచి విడిపోయిన ట్యాంకర్

దొడ్డా నారాయణరావు సతీమణి మృతి


సక్కుబాయి (ఫైల్)

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి స్వాతంత్య్ర సమర యోధుడు దొడ్డా నారాయణరావు సతీమణి, సీపీఐ సీనియర్ నాయకురాలు సక్కుబాయి(85) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల వివిధ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావెళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, బొమ్మగాని ప్రభాకర్, ఉజ్జిని రత్నాకర్, గన్నా చంద్రశేఖర్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, నెల్లికంటి సత్యం, ప్రముఖ వైద్యుడు సుబ్బారావు, కాంగ్రెస్ నాయకుడు చింతకుంట లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు సక్కుబాయి భౌతికకాయానికి నివాళులర్పించారు.

అనారోగ్యంతో బాధపడుతూ రైతు బలవన్మరణం


వెంకట్‌రెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగి రైతు బలవర్మణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం ఉదయం భూదాన్ పోచంపల్లి మండలం శివారెడ్డిగూడెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శివారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వారాల వెంకట్‌రెడ్డి (57)కి భార్య పద్మ, ఇద్దరు వివాహితులైన కుమారులు ఉన్నారు. వెంకట్‌రెడ్డి గ్రామంలో వ్యవసాయం చేస్తుండగా.. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. వెంకట్‌రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటి నుంచి వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడ 4జీ గుళికలను నీటిలో కలుపుకొని తాగాడు. తెల్లవారుజామున బావి వద్దకు వెళ్లిన భర్త ఉదయం 9 గంటలైనా రాకపోయేసరికి ఆందోళనతో భార్య పద్మ అతని ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయదు. దీంతో వారి బావి సమీపంలో ఉన్న రైతుకు ఫోన్‌చేసి విషయం చెప్పగా.. ఆయన వెళ్లి చూడగా వెంకట్‌రెడ్డి మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. మంచం పక్కనే గుళికల ప్యాకెట్, నీళ్ల ఉండటాన్ని గమనించిన సదరు రైతు వెంటనే వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

డబ్బుతో మాయమై.. శవమై కనిపించాడు

- నెల్లికల్లు అటవీ ప్రాంతంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నాగార్జునసాగర్, మిర్యాలగూడ అర్బన్: ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన డబ్బు తీసుకుని కనిపించకుండా పోయిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాగార్జునసాగర్ నియోజవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నాగార్జునసాగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన పడగాల సుధాకర్ (38) కుటుంబంతో కలిసి మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. మిర్యాలగూడలోనే ఏటీఎంల్లో మనీ డిపాజిట్ చేసే హిటాచి క్యాష్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లో క్యాష్ డిపాజిటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల సుధాకర్ ఏటీఎంల్లో డిపాజిట్ చేయాల్సిన రూ.20లక్షలను క్యాష్ డిపాజిట్ చేయకుండా కనిపించకుండా పోయాడు. దీంతో సుధాకర్‌పై సదరు కంపెనీ నిర్వాహకులు ఈ నెల 13వ తేదీన మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కాగా నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని నెల్లికల్లు అటవీ ప్రాంతంలో సుధాకర్ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం పశువుల కాపరి గమనించి నాగార్జునసాగర్ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రత్నకుమారి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


సుధాకర్ (ఫైల్)

చెన్నకేశవస్వామి ఆలయంలో చోరీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఆలయానికి తాళం వేసి వెళ్లిన అర్చకులు సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా చెన్నకేశ్వరస్వామి వెండి కన్ను ఒకటి, నాలుగు చీరలు, వన్ గ్రాం గోల్డ్ వడ్డాణం, హుండీలో ఉన్న సుమారు రూ.15వేలు కనిపించలేదు. దీంతో ఆలయ ప్రధాన అర్చకుడు మనీష్ గౌతమ్ మిర్యాలగూగ రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. అదేవిధంగా పక్కనే ఉన్న శివాలయంలో కూడా దుండగులు చోరీకి యత్నించారు. రెండు నెలల క్రితం ఇదే ఆలయంలో దుండగులు 22 కేజీల ఇత్తడి గంట ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.


స్వామివారి వెండి కన్ను ఎత్తుకెళ్లిన దుండగులు

ఈదురుగాలులకు కుప్పకూలిన కోళ్ల షెడ్డు

- ఐదువేల కోడిపిల్లలు మృతి
- యజమానికి తీవ్ర గాయాలు

గుర్రంపోడు: మండలంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు పిట్టలగూడెం గ్రామంలో రామసాని నరేందర్‌రెడ్డికి చెందిన కోళ్ల షెడ్డు కుప్పకూలింది. ఆ సమయంలో షెడ్డులోనే ఉన్న నరేందర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పక్కనే మరో షెడ్డులో ఉన్న అతడి కుటుంబ సభ్యులు గ్రామస్తులకు సమాచారం అందించగా.. వారు వచ్చి శిథిలాల నుంచి నరేందర్‌రెడ్డిని బయటకు తీసుకొచ్చారు. ఆయనను హుటాహుటిన నల్లగొండలోని ఆస్పత్రికి తరలించారు. షెడ్డు కుప్పకూలడంతో ఐదు వేల కోడిపిల్లలు మృతి చెందినట్లు భావిస్తున్నారు. అదేవిధంగా పిట్టలగూడెం, కొప్పోలు, గుర్రంపోడు, చామలోనిబావి, వట్టికోడు తదితర గ్రామాల్లో భారీ వర్షం కురవడంతో పాటు ఈదురుగాలులకు రోడ్లపై చెట్లు కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఊడిపోయిన బస్సు గేర్ రాడ్డు

చండూరు: ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు గేర్ రాడ్డు ఒక్కసారిగా ఊడిపోయింది. సోమవారం మాల్ నుంచి నల్లగొండకు వస్తున్న ఆర్టీసీ బస్సు చండూరు మున్సిపల్ కేంద్రానికి చేరుకోగానే డ్రైవర్ గేర్ వేసేందుకు ప్రయత్నించగా గేర్ రాడ్డు చేతికి ఊడి వచ్చింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం ప్రయాణికులు మరో బస్సులో ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.


చండూరులో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు